ధరణి పెండింగ్ దరఖాస్తులను... సత్వరమే పరిష్కరించాలి

సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని, సీసీఎల్‌ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండెన్సీ పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వారం, పది రోజుల్లోపు క్లియర్ చేయాలని గడువు విధించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకొని, సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీఓలకు సూచించారు. వక్ఫ్ భూములు, ఈనాం భూములు, డిఫెన్స్ భూములు, నిషేధించబడిన భూములలో ఉన్న దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయని పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను కూడా ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతోందన్నారు. వీటిని అత్యంత ప్రాధాన్యతతో పరిష్కారం జరిగేలా చూడాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. అర్జీల పరిష్కారానికి చేపట్టిన చర్యలను తెలియజేస్తూ ... ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను సవివరంగా పేర్కొనాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను సహేతుకంగా పొందుపర్చాలని ఆదేశించారు. జిల్లా అదనపు విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందు సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్‌తో కలెక్టర్‌సహా జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

సరళీకృత చెల్లింపు పథకంతో ఎల్‌ఆర్‌ఎస్‌పై చర్యలు తీసుకోండి

సాక్షి, సిటీబ్యూరో: సరళీకృత చెల్లింపు పథకం ద్వారా లే ఔట్లను క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు తెలిపారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దానకిషోర్‌తో పాటు ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే... ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా రెవెన్యూ అధికారులు, మునిసిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, పంచాయితీ అధికారులు, కమిటీలను రూపొందించాలన్నారు.

- భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయాలి...

ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేయ్యాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం పురపాలక సంఘాలు, పంచాయతీ అధికారులతో ఆయన మాట్లాడుతూ... వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనికి సంబంధించిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ ప్రకారం కుక్కల జననాలు తగ్గించాల్సిన అవసరముందని కలెక్టర్ స్పష్టం చేశారు. మునిసిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిని పార్కులు, వాకింగ్ ట్రాక్స్, క్రీడా స్థలాలుగా రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేని భవనాలను గుర్తించి వాటికి కూల్చివేయడానికే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా నిర్మించిన భవనాలకు ప్రస్తుత ప్రభుత్వ విధానాల ప్రకారం పన్ను విధించాలన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్లు రాధికాగుప్తా, డి.విజయేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'ప్రతి సోమవారం ప్రజావాణి'

మేడ్చల్: మండల ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారించేందుకు ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మి తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. మండల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఎలాంటి సమస్యలున్నా ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను సారం మండల పరిషత్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

భవిష్యత్ టెక్నాలజీదే...

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



పట్టాలను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ప్రస్తుతం టెక్నాలజీ కొంత పుంతలు తొక్కుతున్న తరుణంలో భవిష్యత్ మొత్తం టెక్నాలజీదేనని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల గ్రాడ్యుయేషన డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, డైరెక్టర్లు శ్రీశైలంరెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రశాంతి, శ్రీకాంత్, అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యం

మేడ్చల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ దీపికారెడ్డి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఛైర్ పర్సన్ దీపికారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని 23 వార్డులలో మున్సిపాలిటీ తరుపున మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తుందని ఛైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో రూ. 3.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి వార్డులో సీసీ, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటాలి...

ప్రభుత్వం చేటప్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కాలనీలలోని ప్రతి ఒక్కరికీ మొక్కలను పంపిణీ చేస్తామని ఛైర్ పర్సన్ దీపిక తెలిపారు. అందరూ తమ ఇళ్ల ముందు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే భాద్యత తీసుకోవాన్నారు. 14వవార్డులో మహిళలకు మొక్కలను అందజేశారు. ఎన్విరార్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనమహోత్సవం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఛైర్ పర్సన్ పావనీ, కమిషనర్ సాబేర్‌అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో వనమహోత్సవం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పదో వార్డులో రకరకాల మొక్కలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ... పర్యవరణాన్ని కాపాడేందుకు నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. ప్రకతిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు శశికళ, రవీందర్, నాయకులు దేవేందర్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, హనుమంతు స్థానికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- ప్రతి ఒక్కరూ మొక్కలను నాటుదాం
- వాటిని రక్షించి స్వచ్ఛమైన భవిష్యత్‌ను అందిద్దాం
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



నాగారంలో మొక్క నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర: పర్యావరణ పరిక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని.. పచ్చదనాన్ని పెంపొందించి పుడమిని తద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరనాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్–మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీలోని 14వ వార్డు శివశంకర్‌నగర్ కాలనీలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు మనమంతా మనహోత్సవంలో పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలను నాటుదామని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాగారం లాంటి పట్టణాల్లో కొత్తగా వెలస్తున్న కాలనీల్లో ప్రజలంతా వనమహోత్సవంలోభాగంగా మున్సిపల్ నుంచి పంపిణీ చేసే మొక్కలను తమ ఇంటి ఆవరణలో నాటుకోవాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలను నాటడం వల్ల భవిష్యత్తులో జరిగే మేలును తెలియజేసే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మ వేణుగోపాల్, అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, బీజేపీ నేతలు కౌకుట్ల రాహుల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషోర్, జంగారెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు పరిపూర్ణ ఆరోగ్యం



నాగారంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ యశోద

కీసర: పిల్లలకు తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని కీసర పీహెచ్‌సీ ఏఎన్‌ఎం ఇందిరా అన్నారు. అంకిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలు తప్పకుండా తాగించాలని, తల్లిపాలలో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. ఏడాది వరకు తప్పకుండా చిన్నారులకు తల్లిపాలే తాగించాలని, డబ్బాపాలు తాగించవద్దని తల్లులు, గర్భిణులకు సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో...

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్‌ సూపర్ వైజర్ యశోద మాట్లాడుతూ... తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తామన్నారు. వివిధ కాలనీల్లో ర్యాలీలను నిర్వహించి తల్లిపాల విశిష్టతను వివరించారు. కౌన్సిలర్ కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లను అందుబాటులోకి తెస్తాం

- ప్రజలకు డంపింగ్ దుర్వాసన లేకుండా చర్యలు తీసుకోవాలి
- సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్



జవహర్‌నగర్‌లో రాజీవ్ స్వగృహ ఇళ్లను పరిశీలిస్తున్న సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డు, రాజీవ్ స్వగృహ ఇళ్లు, నర్సరీలను సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, స్థానిక పాలకవర్గంతో పర్యటించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... రాజీవ్ స్వగృహ ఇళ్లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు, పాలకవర్గానికి సూచించారు. అలాగే ప్రజలకు డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ ప్లాంట్ పనితీరుపై ఆయన రాంకీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. జీవో–59 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఇంటి అనుమతులు ఇవ్వాలన్నారు. కార్పొరేషన్‌లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని తెలిపారు. మేయర్ శాంతి కోటేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సుచరిత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, కార్పొరేటర్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని రైలెక్కబోయి పడిన వ్యక్తి మృతి



మరణించిన గుర్తుతెలియని వ్యక్తి

మేడ్చల్‌రూరల్: ఆగకుండా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ప్రయత్నించి కిందపడి తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. వివరాలివీ... మేడ్చల్ మండలం గౌడవెల్లి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి శనివారం మధ్యాహ్నం పట్టాల మధ్య నిలబడే నగరం నుంచి మెదక్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు గౌడవెల్లి స్టేషన్‌లో హాల్ట్ లేకపోవడంతో రన్నింగ్ ట్రెన్ ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడుని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

'చెత్త సేకరణకు వాహనం ఉంటే సంప్రదించండి'

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేనందున ఎవరైనా సొంత వాహనాలు కలిగి ఉంటే వారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ నాగిరెడ్డి కోరారు. మున్సిపాలిటీలో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణకు ఆసక్తి ఉన్న ఏజెన్సీలు, ఆటో లేదా ట్రాక్టర్ ఉన్న వాహన యజమానులు డ్రైవర్‌ను సమకూర్చుకుని సంప్రదించాలని కోరారు. ఔత్సాహికులు ముందుకొస్తే చెత్త సేకరించినందుకు ప్రతి ఇంటికి నెలకు రూ. 50 వసూలు చేసుకునేందుకు మున్సిపల్ అనుమతి ఇస్తుందని తెలిపారు. వివరాలకు ఫోన్: 70328 98999లో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్‌కు విగ్రహానికి పాలాభిషేకం

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుమతి ఇవ్వడం, సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేస్తామని ప్రకటించడంతో మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు కలిసి అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ మాదిగ చిత్రపటాని పాలతో అభిషేకం చేసి సంబరాలు జరుపుకొన్నారు. గ్రామంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద మంద కృష్ణమాదిగ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సంజీవరావు, విఘ్నేశ్వర్‌రెడ్డి, బి.వెంకటేష్, ఆరీఫ్, శ్రీరాంరెడ్డి, రాంచందర్, సుధాకర్, ప్రభాకర్, కాంతారావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సదానందం అనారోగ్యానికి గురికావడంతో కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అతని వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందించి శనివారం రూ. 1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రతి పేదవాడికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. నాయకులు మాట్ల వినయ్‌కుమార్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



మేడ్చల్: రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం ప్రభుత్వం జాబ్ కేలండర్ విడుదల చేయడంతో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మేడ్చల్ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. విద్యార్థి నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను ఏర్పాటు చేసి పాలతో అభిషేకించారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్, కార్యదర్శి రాకేష్, నాయకులు శ్రీధర్, బ్రహ్మ, పాండు, శశి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అంశంపై జేఏసీ సమావేశం



మంత్రి సీతక్కకు వినతిపత్రాన్నిస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: మండలంలోని మాదారం, అవుషాపూర్, అంకుషాపూర్ గ్రామాలు యాదాద్రి–భువనగిరి జిల్లాలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల అఖిలపక్ష నాయకులు కేపాల్ సమీపంలో శనివారం సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలో ఉన్న వారిని మేడ్చల్ జిల్లాలో కలిపారని, అనంతరం యాదాద్రి జిల్లాలో కలపడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బీబీనగర్ మండలంలో కలపకూడదని కోరుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు, కమిటీ సభ్యురాలు, మంత్రి ఎమ్మెల్యే సీతక్క, స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్‌కు వినతి అందజేయాలని తీర్మానించారు. విలీనం ఆపని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అలాగే జేఏసీ తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నేతలు కొండల్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, ప్రవీణ్‌రావు, శోభారాణి, కె.గోపాల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, మాధవరెడ్డి, వామన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, రవి, సి.హెచ్.గోపాల్‌రెడ్డి, కష్టగౌడ్, వెంకట్‌రెడ్డి, పి.రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలపొద్దని మంత్రి సీతక్కకు వినతి

అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రి భువనగిరి జిల్లాలో కలుపొద్దని కోరుతూ పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు, బీజేపీ నాయకుడు మశ్చేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సందీప్, వెంకటేశ్‌గౌడ్, మహేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రూ. లక్ష టోకరా

పోచారం: పార్సిల్ వచ్చిందని నమ్మించి మహిళను మోసగించిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చౌదరిగూడకు చెందిన గొట్టిపాటి మహిళకు కాబుల్ నుంచి బట్టలు, ల్యాప్‌టాప్, సిమ్‌కార్డులు వంటి సామగ్రితో పార్సిల్ వచ్చిందని, అందుకు రూ. లక్ష చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేయడంతో ఆమె చెల్లించింది. తర్వాత మరో రూ. 95499 చెల్లించాలని కోరడంతో మోసపోయానని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'స్వచ్ఛదనం–పచ్చదనం'ను విజయవంతం చేద్దాం

నాగారం మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పావని, ప్రత్యేక అధికారి ప్రశాంత్

కీసర: నాగారం మున్సిపాలిటీలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమంపై వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు మున్సిపల్ పరిధిలో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోజు వారీ షెడ్యూల్ ప్రకారంగా ప్రతి వార్డులో పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు, రహదారుల వెంట మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కమిషనర్ రాజేంద్రకుమార్, మున్సిపల్ మేనేజర్ కె.చంద్రశేఖర్, డిప్యూటీ మేనేజర్ సుదర్శనం, రఘు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ పావనీ జంగయ్య అన్నారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టవలసిన వివిధ పనులపై ప్రత్యేక అధికారి ప్రశాంత్‌తో కలిసి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మండల పరిషత్ కార్యలయంలో...

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి విజయవంతం చేయడంపై చర్చించారు. కమిషనర్ సాబేర్ అలీ, ఎంపీడీఓ గీతారెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, సంగీత, ఆంజనేయులుగౌడ్, శశికళ, మేనేజర్ వెంకట్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి పద్మిని, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం గో గ్రీన్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గౌడవెల్లి గ్రామాల్లో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ... విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. గో గ్రీన్ ప్లాంటేషన్ పేరుతో మొక్కలు నాటడమే కాకుండా పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు కళాశాలలో ఆవరణలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

పారిశ్రామిక రంగంలో రాణించాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టార్టప్ ఫండింగ్ అండ్ వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీ హబ్ స్టార్టప్ ఎకో సిస్టం ఎనేబుల్ మేనేజర్ గౌరవ్‌గుప్తా, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ... విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. కొత్త ప్రోడక్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేటప్పుడు దీర్ఘకాలిక ఫలితాలు ఉండేలా చూడాలన్నారు. స్టార్టర్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాలు అందిస్తాయని, పలువురు ఎంటర్‌ప్రెన్యూర్‌లు ఎదిగిన తీరును విద్యార్థులకు వివరించారు. కళాశాల కార్యదర్శి టి.వి.రెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల సంఘీభావ సదస్సును విజయవంతం చేయండి

జవహర్‌నగర్: ఆదివాసీ హక్కులు, కార్పొరేటీకరణ సంఘీభావ ఉద్యమాలు అనే అంశాలపై ఈ నెల 9, 10వ తేదీల్లో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అఖిల భారత సదస్సును విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ల భాగస్వామ్య సభ్యులు రషీద్ ద్రావిడ అధ్యక్షతన శనివారం జవహర్‌నగర్‌లో సంఘీభావ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. పీడీఎం చంద్రమౌళి, ఇఫ్టూషేక్ షావలి, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రవీణ్, శివబాబు, ఏఐఎఫ్‌టీయూ మల్లేష్, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, ఐపీవోడబ్ల్యూ సునీత, పుణ్యవతి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ టి.కాలేషా, సయ్యద్, బాలు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నల్లాల చోరీ: నిందితుడి అరెస్టు



నిందితుడు రమేశ్‌రెడ్డి

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి ఇంటిలో చోరీ చేసిన నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... పట్టణంలోని బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన సద్దిగాని జనార్దన్ గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ జియాగూడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. జనార్ధన్ ఇంటి పక్కన ఉండే ఓ మహిళ శుక్రవారం రాత్రి వారికి ఫోన్ చేసి మీ ఇంటిలో ఏవో శబ్దాలు వస్తున్నాయని సమాచారం ఇచ్చింది. వెంటనే జనార్ధన్ తన స్నేహితుడు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పరిశీలించమని కోరగా అతడి ఇంటికి వెళ్లి చూడగా బాత్రూం, కిచెన్‌లో బిగించిన 10 నల్లాలు (ట్యాబ్)లు కనిపించలేదు. స్నేహితుడి సమాచారం మేరకు ఇంటికొచ్చి పరిశీలించి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విశ్వసనీయమైన సమాచారంతో మైసమ్మగుట్ట సర్వీస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడు జనగాం జిల్లా బచ్చన్నపేట్ మండలం అలీపూర్ గ్రామానికి చెందిన గంటా రమేష్‌రెడ్డి(29)గా తేలింది. అతడిని విచారించగా ఘట్‌కేసర్‌లోని ఓ ఇంటిలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. పంచనామా అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.